క్లుప్తంగా

నేడు కృష్ణాష్టమి

సి.బెళగల్: మండలంలో సోమవారం శ్రీ కృష్ణుడి జన్మదినం సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గొల్లలదొడ్డి, పోలకల్, గుండ్రేవుల తదితర గ్రామాలు వేడుకలకు ఆలయాలు ముస్తాబ్యాయి. గొల్లలదొడ్డి గ్రామంలో శ్రీ కృష్ణుడి ఆలయాన్ని రంగులతో సుందరంగా అలంకరించారు. వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని పూజారి నరసింహాచార్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. అదేవిధంగా పోలకల్ గ్రామంలోని ముడుమాల గ్రామంకు వెళ్లె దారిలో కొలువైన శ్రీ కృష్ణుడి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు, స్థానికులు తెలిపారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమైన గడివేముల మూలపెద్దమ్మ ఆలయంలో శ్రావణ మాసం ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా దుర్గా భోగేశ్వరాలయం, బాలాజీ దేవాలయాలలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ సమితి సమ్మేళనాలు జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కోడుమూరు రూరల్: సెప్టెంబరు 1,2,3వతేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. ఆదివారం కోడుమూరులో సమ్మేళనాల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను పాల్పడుతూ కార్పొరేట్‌లకు అండగా నిలుస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం ప్రైవేటీకరణ చేస్తుండడంతో వేలాది మంది కార్మికులు రోడ్డు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థలోనే కొనసాగించాలని, స్కీం వర్కర్లను, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, బజారి, మధు, మణి తదితరులు పాల్గొన్నారు.

29న వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 29న సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం 10.30 గంటల నుంచి ×దేశ భాషలందు తెలుగు లెస్సన్ అంశంపై పోటీలు ఉంటాయని చెప్పారు. వక్తృత్వ పోటీలో ఒక్కొక్కరికి 3 నిమిషాల వ్యవధి ఉంటుందని, ఎలాంటి ఆంగ్ల పదాలు వాడకూడదని, వ్యాసరచనకు గంట వ్యవధి ఉంటుందని మూడు పేజీలకు మించకుండా వ్యాసం రాయాలని పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5 కన్సోలేషన్ బహుమతులను అదే రోజు సాయంత్రం 6 గంటలకు ప్రముఖుల చేతుల మీదుగా అందించనున్నట్లు వెల్లడించారు.

దేశ అభివృద్ధిలో యువత కీలకం



విజేతలకు కప్పులు, మెడల్స్ బహూకరించిన భూపతిరావు

కర్నూలు (టౌన్): దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పేర్కొన్నారు. స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఆదివారం మినీ మారథాన్ పోటీ నిర్వహించారు. మైదానం నుంచి జగన్నాథ గట్టు వరకు మారథాన్ రన్‌ను డీఎస్ డీఓ ప్రారంభించారు. యువతీ, యువకులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశానికి యువత ప్రాతినిథ్యం ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలన్నారు. మినీ మారథాన్‌ను 20 నిముషాల్లో పూర్తి చేసిన క్రీడాకారులకు ఆయన కప్పులు, మెడల్స్ అందజేశారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతూనే ఉన్నాయి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన అమానుషం. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. వైద్యులు, సిబ్బందిపై కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నా సర్దుకుని పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రులలో భద్రత కల్పించేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టాలి. కోల్‌కతా దుండగులను కఠినంగా శిక్షించాలి.

–వి.శశికళ, గ్రామీణ ఆరోగ్య కార్యదర్శి, కల్లూరు



దుండగులకు జీవిత ఖైదు విధించాలి



కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులకు జీవిత ఖైదు విధించడమే సరైన శిక్ష. నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్న వైదులకు రక్షణలేకపోతే ఎలా. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారయంత్రాంగం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రులలో రక్షణ చర్యలు చేపట్టాలి. మహిళల జోలికి రావాలంటే భయపడేలా చట్టాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ మంజుల, వైద్యాధికారిణి, ఓర్వకల్లు సీహెచ్‌సీ

మట్టి గణపతులే మేలు!

- 7వ తేదీన వినాయక చవితి
- వాడవాడలా కొలువుదీరనున్న గణపయ్య విగ్రహాలు
- పీఓపీ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మట్టి వినాయక విగ్రహాలు



గడివేముల: వినాయక చవితి అంటేనే భారీ గణపయ్యల విగ్రహాలు గుర్తొస్తాయి. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా సంబరాలు చేసుకునే పెద్ద పండగ. సెప్టెంబర్ 7న వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఊరువాడలో కొలువుదీరనున్నారు బొజ్జగణపయ్యలు. ప్రత్యేక పూజల అనంతరం 9, 11 రోజుల్లో వినాయక విగ్రహాలను చెరువులు, ప్రధాన కాల్వలలో అంగరంగా వైభవంగా నిమజ్జనం చేస్తారు. అక్కడక్కడ ఐదురోజుల్లోనూ నిమజ్జనం పూర్తి చేస్తారు. అయితే పీఓపీ విగ్రహాలతో పర్యావరణం దెబ్బతింటుంది. గతంలో పోలిస్తే ప్రస్తుతం కొంతమేర చైతన్య వచ్చినప్పటికీ ఇంకా రావాల్సిన అవసరం ఉంది. వినాయకచవితి కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. భారీ సంఖ్యలో పీఓపీ విగ్రహాలను ఇప్పటికే తయారు చేశారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో(పీఓపీ) ఏర్పడే పర్యావరణ సమస్యలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం అందరిపై ఉంది. పీఓపీతో పొంచి ఉన్న ముప్పును వివరించి మట్టి విగ్రహాలను వినియోగించేలా ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఉంది. పీఓపీ విగ్రహాలు త్వరగా కరగక నీటిలో జిప్సంగా మారి కాలుష్యానికి కారణమై నీటిలో ప్రాణ వాయువు స్థాయి తగ్గి జలచరాలకు ఇబ్బందిని కలిగిస్తాయి. భూమిలోకి నీటిని ఇంకనీయకుండా అడ్డుకుంటాయి. దీంతో నీరు ఆవిరై వృథా అవుతుంది. దీనికితోడు ఇవి త్వరగా కరగవు. నీటి కాఠిన్యాన్ని పెంచి నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. నీటి ఆమ్లత్వాన్ని, టీడీఎస్(టోటల్ డిస్సాయిల్వ్ సాలిడ్స్) శాతాన్ని పెంచుతుంది. పీఓపీతోబాటు ఉపయోగించే రంగులతో హానికరమైన పాదరసం, కాడ్మియం, సీసం ఉంటుంది. ఇవి కలిసిన నీరు కిడ్నీలు, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. నీటిలో కలిసే థర్మోకోల్, ప్లాస్టిక్ పువ్వులు, వస్త్రాలతో నీటి కాలుష్యం ఎక్కువ అవుతుంది. అలాంటి అపరిశుభ్రమైన నీటిని తాగడం మూలంగా పశువులు సైతం రోగాలకు గురవుతాయి. పీఓపీ కాకుండా మట్టి విగ్రహాలనే వాడేలా ఎవరికివారు వ్యక్తిగతంగా ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఉంది.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా....

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) వలన జరిగే అనర్థాలపై స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్య పరుస్తున్నాయి. పాఠశాలల్లోనూ మట్టి వినాయకులు ఆవశ్యతను ఉపాధ్యాయులు పిల్లలకు వివరించాల్సి ఉంది. సోషల్ మీడియాలోనూ పలువురు వీఐపీలు మట్టి ప్రతిమలనే వాడుదామంటూ తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు. దీనికి తోడు సంబంధిత కుమ్మర, శాలివాహన సంఘాలు మట్టి బొమ్మల ఆవస్యతను తెలియజేస్తున్నాయి. దీంతో కొంతమేర ప్రజలు మట్టి వినాయకులు కొనుగోళ్లకు ఆసక్తిని చూపుతున్నారు. కొందరు ఇళ్లలో చిన్నపాటి మట్టి గణపయ్యలను కొలువుంచి పూజలు చేస్తున్నారు. పీఓపీ అనర్థాలపై ప్రజల్లోనూ అవగాహ న పెరుగుతున్నప్పటికీ ఇంకా చైతన్యం రావాల్సి ఉంది.

మట్టి విగ్రహాలు కొలువుంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం



మట్టి విగ్రహాల ధర చాలా తక్కువగా ఉంటుంది. ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయి. చెరువులోని మట్టితో చేసిన విగ్రహాలు పర్యావరణానికి ఏ మాత్రం హాని కలిగించవు. చెరువులోని పూడిక మట్టి తీయడం వలన పరోక్షంగా చెరువుకు మేలు జరుగుతుంది. నీటి నిల్వ శాతం పెరిగి భూగర్భజలాలు పెరుగుతాయి. వీటిని తయారు చేసే వ్యక్తులకు ఆర్థిక భరోసాతో పాటు వారిని ప్రోత్సహించినట్టే. ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను కొలువుంచి పర్యావరణాన్ని బాధ్యతగా కాపాడుకుందాం.

– డి.గఫూర్, విద్యావేత్త, గడివేముల

అనుమానాస్పదంగా సంచరిస్తుంటే సమాచారం ఇవ్వండి

గడివేముల: గ్రామాల్లో అనుమానితులు, కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఊర్లకు వెళ్లే వ్యక్తులు ఇంటి ప్రక్కల వారికి సమాచారం అందించడంతో పాటు ఇంట్లో లైట్లను వేయాలన్నారు. తమ వాహనాలకు జాగ్రత్తగా తాళాలు వేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇళ్లముందుగాని, కాలనీల్లో అనుమానాస్పందగా తిరిగే వారిపై 9121101097కు సమాచారం అందించాలన్నారు.

అక్రమ బెల్లం స్వాధీనం

ఓర్వకల్లు: మండలంలోని పూడిచెర్ల మొట్టవద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న సారాకు వినియోగించే బెల్లం 2,240 కిలోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, జలౌన్ జిల్లా, సమీకొంచు గ్రామానికి చెందిన దిల్షద్‌ఖాన్ టీఎస్ 13 యుడీ 0490 నంబర్ టాటా గూడ్స్‌లో బెల్లాన్ని తరలిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఎస్‌ఐ సిబ్బందితో కలిసి పూడిచెర్ల బస్సుస్టేజీ వద్ద కాపుకాశారు. వాహనాన్ని అదుపులోకి తీసుకొని పరిశీలించగా 2,240 కిలోల బెల్లం, సారా తయారీలో ఉపయోగించే 5 కిలోల నవసాగ్రాన్ని గుర్తించారు. సారాతయారీదారులైన గుడుంబాయి తండాకు చెందిన నెనావత్ వెంకటేశ్‌నాయక్‌ను పోలీసులు విచారించారు. వాస్తవం అంగీకరించడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఎక్కడైనా నాటుసారా, బెల్టుషాపులు, పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్‌ఐ హెచ్చరించారు.

సాంబశివయ్య నగర్‌లో చోరీ

కర్నూలు టౌన్: నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని సాంబశివయ్య నగర్‌లో ఆదివారం చోరీ జరిగింది. కాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి ఆర్మీలో పనిచేస్తున్నాడు. బంధువులను చూసేందుకు వెళ్లిన సమయంలో దొంగలు తాళాలు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించి మూడున్నర తులాల బంగారం, వెండి నగలను తీసుకొని ఊడాయించారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రంగస్వామి

కోడుమూరు రూరల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపేది లేదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు నెలల తరబడి కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా హాస్టళ్లకు సొంత భవనాలు లేవని, కుక్ కామాటి, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు 27,28,29వ తేదీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట చేపట్టనున్న రీలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని రంగస్వామి విద్యార్థులకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వీరేంద్ర, వీరాంజనేయులు, అల్తాఫ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా జయంతి



పాణ్యంలో మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఆదివారం సేవామూర్తి మదర్ థెరిసా జయంతిని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాణ్యం నియోజకవర్గస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శిగా వనంరాజు, సహాయ కార్యదర్శులుగా రవీంద్ర నాయక్, నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రేష్మ, రసూల్, ట్రెజరర్‌గా సుశేలుడిన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డీపీ మస్తాన్ వలి, సహాయ కార్యదర్శి సాంబవరపు ఎల్లయ్యలు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల సంరక్షణే అసోసియేషన్ లక్ష్యమన్నారు.

సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యం



మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు

ఓర్వకల్లు: పొదుపు మహిళలకు సుస్థిర జీవనోపాధులను కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కెనరా బ్యాంక్ డీఎం సురేష్ పేర్కొన్నారు. స్థానిక పొదుపు భవనంలో ఆదివారం లక్ పత్‌కా దీదీ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. మండల సమాఖ్య ప్రెసిడెంట్ రత్నమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఎం తో పాటు, ఏపీఎం వెంకటరామిరెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ రవిశంకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యక్ష ప్రసంగాన్ని పొదుపు మహిళలు వీక్షించారు. అనంతరం హుసేనాపురం, నన్నూరు ఏపీజీబీ, ఓర్వకల్లు కెనరా బ్యాంక్ పరిధిలోని 38 సంఘాలకు మంజూరైన రూ.3.05 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. అలాగే లక్ పత్ కా దీదీలకు, సీఆర్‌పీలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల ఏపీఎం నాగరాజు, మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు సరస్వతమ్మ, కార్యదర్శి సమతి, సభ్యులు రామసుబ్బమ్మ, జుబేదాబి, వెలుగు సిబ్బంది, వీవోఏలు, సీఓలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా..రాకపోకలు ఎలా?



దిన్నెదేవరపాడు రోడ్డుపై ఏర్పడిన గుంతలు



బురదమయంగా ఉన్న నంద్యాల చెక్‌పోస్టు గౌతమినగర్ రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్ కాలనీలోని పలు రోడ్లు గుంతలమయంగా మారాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గుంతల్లో నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కల్లూరు అర్బన్ 19వ వార్డులోని గౌతమీనగర్, 21వ వార్డులోని మహాలక్ష్మినగర్, పార్థసారథి నగర్, 41వ వార్డులోని పలు కాలనీ రోడ్లు అధ్వానంగా మారాయి. అలాగే కర్నూలు నగరం సిల్వర్ జూబ్లీ కళాశాల నుంచి దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డుతో పాటు సైనిక భవనం, గిరిజన గురుకుల పాఠశాల, మహాలక్ష్మీనగర్‌లోని రోడ్లపై గుంతలు ఏర్పడాయి. సిల్వర్ జూబ్లీ కళాశాల నుంచి సైనిక భవన్ వరకు ఉన్న రోడ్డు నెర్రలిచ్చింది. ఈ రోడ్లలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

వర్షమొస్తే చిత్తడే

ఈ రోడ్డు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు గౌతమినగర్‌లో ఉంది. వర్షం వస్తే రోడ్డు చెరువును తలపిస్తుంది. వాన నీరు, బురద కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి. ధైర్యం చేసి కొందరు వెళ్లినా అదుపు తప్పి కింద పడిన ఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డులో అనేక అపార్టుమెంట్లు, రెండు పాఠశాలలు ఉండడంతో విద్యార్థులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారి లేక చుట్టి వెళ్లాల్సిన పరిస్థితి. ఇదే ప్రాంతంలోనే నగరపాలక కమిషనర్ ఇల్లు ఉండడం...ఆయన ఈ రోడ్డులోనే రాకపోకలు సాగించడం గమనార్హం.

రోడ్డంతా గుంతలే... అడుగుపడేదెలా ?



గడివేముల టూ కొర్రపోలూరు దారి దుస్థితి

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు, సోమాపురం గ్రామాల రోడ్లు అధ్వాన్నంగా మారాయి. మండల కేంద్రం నుంచి ఆ రెండుగ్రామాలకు వెళ్లాలంటే నరకయాతనే. నడుం నొప్పులుంటే పోతాయ్...లేకుంటే మాత్రం తప్పకుండా వస్తాయంటూ ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకటి కాదు...రెండు కాదు ఊర్లోకి వెళ్లే వరకు గుంతలు ఉండటంతో అనేక పర్యాయాలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు లేకపోలేదు. ఈ గ్రామాలకు బస్సు సౌకర్యాలు సరిగ్గా లేకపోవడంతో అధికంగా బైకుల పైనే రావాల్సి వస్తుంది. గుంతల మూలంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ గ్రామాల్లో ఎవరైనా ఆరోగ్య సమస్యలతో అత్యవసర వేళల్లో ఆస్పత్రులకు వెళ్లేలోపే ప్రాణాలు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రెండు గ్రామాల రహదారులకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం జారీపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: ఎస్టీ కానీ వారికి ఎరుకల కుల ధృవీకరణ పత్రాన్ని జారీ చేసిన కౌతాళం తహసీల్దారు కె.మల్లికార్జున స్వామిపై చర్యలు తీసుకోవాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకల రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఎరుకుల హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ కమ్యూనిటీలోని మాదిగ కులానికి చెందిన నల్లగోడి శ్రీనివాసులుకు ఎస్టీ ఎరుకుల కులం అని కౌతాళం తహసీల్దారు ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నారు. ఆదోనిలోని సదాపురం ఆది ఆంధ్ర పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తూ కుల ధృవీకరణ పత్రాల విషయంలో నల్లగోడి శ్రీనివాసులు సస్పెండ్ అయ్యారన్నారు. విచారణ జరిపి అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు మెడ సారి గోపాల్, నాయకులు చౌట రామయ్య, ఎరుకుల హరి, హెబ్బటం లక్ష్మన్న, కవిశ్వరుడు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

- రెండు స్తంభాలు ధ్వంసం
- శనివారం అర్ధరాత్రి నుంచి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ఇబ్బందులు పడిన కాలనీల వాసులు



వాహనం ఢీకొనడంతో విరిగిపోయిన కరెంట్ స్తంభం

కోడుమూరు రూరల్: మండల కేంద్రం కోడుమూరులోని బళ్లారి రోడ్డులో ఉన్న విద్యుత్ సరఫరా ప్రధాన స్తంభాన్ని శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ స్తంభంతో పాటు మరొకటి పూర్తిగా విరిగిపోయింది. విద్యుత్ తీగెలు తెగిపోయాయి. దీంతో కొండపేట, మెయిన్‌రోడ్డు, లక్ష్మి నగర్, వెంకటేశ్వరనగర్, షణ్ముఖరెడ్డి, చిన్నబోయ వీధి, కోటవీధిలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. అయితే ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే మరమ్మతులు చేసి కొన్ని కాలనీలకు తాత్కలికంగా కరెంట్ సరఫరాను పునరుద్ధరించినప్పటికీ, కొండపేట, మెయిన్ రోడ్డు వాసులకు మాత్రం ఆదివారం సాయంత్రం వరకు కరెంట్ లేదు. దీంతో ఆయా కాలనీవాసులు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాన్స్‌కో సిబ్బంది విరిగిపోయిన స్తంభాలను తీసేసి వాటి స్థానంలో కొత్తవి వేయడంతో పాటు, కరెంట్ లైన్లను పునరుద్ధరించారు. మధ్యాహ్నం 12నుంచి 5గంటల వరకు కరెంట్ సరఫరా పూర్తి నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్తంభాన్ని ఢీకొట్టిన డ్రైవర్ వాహనాన్ని నిలబెట్టకుండా వెళ్లడంతో ఆచూకీ కోసం పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు గాలిస్తున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎంపీపీ బొంతల మునెప్ప



పొదుపు మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

సి.బెళగల్: పొదుపు మహిళలు ప్రభుత్వ పథకాలతో బ్యాంక్ రుణాలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీపీ బొంతల మునెప్ప సూచించారు. ఆదివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఏపీఎం వెంకటస్వామి ఆధ్వర్యంలో లక్ పత్‌కా దీదీ లబ్ధిదారులైన 21 గ్రూపు సభ్యులకు రూ.1,39,50,000 మెగా చెక్కును అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసనాయక్ బ్యాంక్ రుణాల తీరును వివరించారు. బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. లఖ్ పతి దీదీ కార్యక్రమ నిర్వహణలో బాగా పనిచేసిన గ్రూపు సభ్యులకు, వీఓఏలకు ప్రశంసా పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అల్లిరాణెమ్మ, వీరన్న గౌడ్, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, సీసీ రాముడు తదితరులు పాల్గొన్నారు.